ప్రజాశక్తి

సోమవారం 31 జులై 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

'ఉక్కు' పాదయాత్ర

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాటం మొదలుపెట్టి 900 రోజులు అవుతున్న నేపథ్యంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, ఉక్కు నిర్వాసితుల సంఘం ఆధ్వర్యాన గంగవరం, పెదగంట్యాడ, వడ్లపూడి, కూర్మన్నపాలెం, అగనంపూడి, ఉక్కునగరం ప్రాంతాలో ఆదివారం పాదయాత్రలు జరిగాయి. ఉక్కు కార్మిక చైతన్య భేరి పేరిట జరిగిన ఈ పాదయాత్రల్లో పెద్ద సంఖ్యలో ఉక్కు కార్మికులు, నిర్వాసితులు పాల్గొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నిర్వాసిత కాలనీల్లో పెద్ద పెట్టున నినదించారు. ఉక్కు పరిరక్షణ పోరాటానికి ఇంటర్ విద్యార్థి మంత్రి చార్మిల తాను దాచుకున్న డబ్బులను విరాళంగా అందించి స్ఫూర్తినింపింది. (ప్రధాన వార్త మెయిన్‌లో..)

సిఎం విశాఖ పర్యటన ఖరారు

- 1న ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన
- ఎయులో నాలుగు నిర్మాణాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆగస్టు 1న సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నంలో పర్యటించనున్నారని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ పర్యటనలో భాగంగా ఉదయం 9:30 గంటలకు సిఎం గన్నవరం ఎయిర్‌పోర్టులో బయలుదేరి 10:45 గంటలకు విశాఖ చేరుకుంటారు. అక్కడి నుంచి 10:55 గంటలకు కైలాసపురం వెళ్తారు. 11:15 నుంచి 12:20 గంటలు మధ్య ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 12:40 గంటలకు సిరిపురంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చేరుకుని అక్కడ నిర్మించిన నాలుగు భవనాలను ప్రారంభిస్తారు.

తదుపరి అక్కడి నుంచి 1:00 గంటకు బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకొని ఎయు విద్యార్థులతో సమావేశమవుతారు. 1:20 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 1:50 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు వచ్చి విజయవాడకు వెళ్తారు.

విశాఖ నుంచి పలు రైళ్లు రద్దు

ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. 17267 కాకినాడ-విశాఖపట్నం ప్రత్యేక ప్యాసింజర్, 17268 విశాఖపట్నం-కాకినాడ ప్రత్యేక ప్యాసింజర్, 07466 రాజమండ్రి-విశాఖపట్నం ప్యాసింజర్, 07467 విశాఖపట్నం-రాజమండ్రి ప్యాసింజర్ ప్రత్యేక రైలు, 22701 విశాఖపట్నం-విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 విజయవాడ - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్ళను జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు రద్దు చేశారు.

మొదటి పేజీ తరువాయి..

అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ఐక్య పోరాటాలు సాగించాలని ఆదివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. సమావేశంలో స్ట్రగుల్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యారావు, యుఇఇ నాయకులు వేపాడ సత్యనారాయణ, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.రెహమాన్, సాయి శంకరరావు మాట్లాడారు. ఎపి విద్యుత్ సంస్థలోని ఉద్యోగుల, కాంటాక్ట్ కార్మికుల, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యుత్ ఉద్యోగులకు సంబంధించిన ఎపిఎఫ్ నుంచి జిపిఎఫ్, పీస్ రేట్ కార్మికుల ఉద్యోగ భద్రత మొదలగు డిమాండ్ల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. వేతన సవరణ విషయంలో తాత్సారం తగదన్నారు. ఆగస్టు 10 తరువాత సమ్మెలోకి వెళ్తున్నట్టు వెల్లడించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో స్ట్రగుల్ కమిటీ నాయకులు, మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు శివారెడ్డి, రామకృష్ణ, సెక్షన్ ఆఫీస్ కంప్యూటర్ ఆపరేటర్స్ యూనియన్ నాయకులు అప్పారావు, పరశురామ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రకళా ప్రదర్శన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కళను, కళా సంస్కృతిని పెంపొందించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కళాయజ్ఞ- జీవన రేఖలు ఏకవర్ణ చిత్రకళా ప్రదర్శన, చిత్రలేఖనం పోటీలు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉత్సాహంగా సాగాయి.

ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న అతిథులు

జీవన రేఖలు చిత్రకళా ప్రదర్శనను ఆంధ్రా యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ డిపార్టమెంట్ ప్రొఫెసర్ శిష్టా శ్రీనివాస్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులకు ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ముందుకు వెళుతూ ప్రాచీన కళలను కాపాడుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం ప్రముఖ చిత్రకారులు శేషబ్రహ్మం మాట్లాడుతూ చిత్రకారులకు అవకాశాలను కల్పిస్తే వారు ఈ కళలో రాణించగలరన్నారు. అలాగే చిన్నారులు చిత్రలేఖనాన్ని అభ్యసించటం వల్ల మానసికోల్లాసాన్ని పొందగలరన్నారు. అనంతరం ప్రముఖ యువ రచయిత మన హీరోలు సృష్టికర్త సుబ్బు ఆర్వీ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. అనంతరం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు రాజేశ్వరరావు, బుజ్జి మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో భాగంగా నేటి తరం చిన్నారులు చిత్రకళ ఔన్నత్యాన్ని తెలియపరచాలనే ముఖ్య ఉద్దేశ్యంతో నిర్వహించిన ఆర్ట్ కాంటెస్ట్‌కి మంచి స్పందన వచ్చింది. సుమారు 350 మందికిపైగా చిన్నారులు ఈ కాంటెస్ట్‌లో పాల్గొని తమ ప్రతిభ చాటారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ కళాయజ్ఞ - జీవన రేఖలు చిత్రకళా ప్రదర్శన లో పాల్గొన్న కళాకారులకు, ఆర్ట్ కాంటెస్ట్‌లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందించారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ సంస్థ తరుపున సునీల్ కుమార్ అనుమకొండ, గిరిధర్ అరసవల్లి, స్ఫూర్తి శ్రీనివాస్, మల్లిక్‌లు కార్యక్రమాన్ని పర్యవేక్షించగా భారీ సంఖ్యలో కళాకారులు, కళాభిమానులు, యువ చిత్రకారులు పాల్గొన్నారు.

కోస్టల్ సెక్యూరిటీ గార్డుల తొలగింపు దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సముద్ర ప్రాంతంలో ఎటువంటి దొంగతనాలూ జరగకుండా కాపాడేందుకు, విదేశీయుల అక్రమ చొరబాటు నుంచి రక్షించేందుకు, సముద్ర సంపదను కాపాడేందుకు ఉద్దేశించిన కోస్టల్ సెక్యూరిటీ గార్డ్సను తొలగించడం సరికాదని, తొలగించిన వారందరినీ తిరిగి నియమించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. ఎపి కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ బోట్ క్రూ అసోసియేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్, తాతాజీ, సుధాకర్, ప్రతాప్, అప్పారావు,నాగరాజు పాల్గొన్నారు.

ఎంపీ ఎంవివికి మహిళా పోలీసుల వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణను ఆదివారం ఆయన కార్యాలయంలో మహిళా పోలీసు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహాలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధులత కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. మహిళా పోలీసులకు సరైన జాబ్ చార్ట్ లేనందున తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఐసిడిఎస్‌తో విస్తృత సేవలు

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పలు పథకాలు - సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి

ప్రజాశక్తి - అనకాపల్లి : చిన్నారులు, గర్భిణిలు, బాలింతలకు ఐసిడిఎస్ ద్వారా విస్తృత సేవలు అందిస్తున్నట్టు ఆ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి తెలిపారు. 'ప్రజాశక్తి'తో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీ సెంటర్ల పరిస్థితి, సిబ్బంది పనితీరు, అందిస్తున్న సేవలను తెలియజేశారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

జిల్లాలో ఐసిడిఎస్ ప్రాజెక్టులో ఎన్ని మెయిన్, మినీ అంగన్‌వాడీ సెక్టార్లు, సెంటర్లు ఉన్నాయి ?

జిల్లాలో మొత్తం 74 సెక్టార్లు ఉండగా 1725 మెయిన్ సెంటర్లు, 183 మినీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 1697 మంది మెయిన్ వర్కర్లు, 1650 మంది హెల్పర్లు, 172 మినీ వర్కర్లు, 58 మంది సూపర్ వైజర్లు పనిచేస్తున్నారు.

సిబ్బంది కొరత ఉందా ?

రిజర్వేషన్ కేటగిరీలో 28 మెయిన్ వర్కర్లు, 11 మినీ వర్కర్లు, 75 హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటికి నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేసేందుకు కృషి చేస్తున్నాం.

సొంత భవనాల సంగతేంటి ?

ప్రస్తుతం 836 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 639 అద్దె భవనాల్లో, 433 కేంద్రాలు సామాజిక భవనాలు వంటి ఉచిత భవనాల్లో నడుస్తున్నాయి. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలు 47 వేలా 875 మంది, మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు 31 వేలా ఐదు మంది ఉన్నారు. అలాగే 9 వేలా 994 మంది బాలింతలు, 9 వేలా 72 మంది గర్భిణులు ఉన్నారు.

ప్రతి నెలా అందించే పౌష్టికాహారం వివరాలు తెలపండి ?

ప్రతినెలా ఐసిడిఎస్ ప్రాజెక్టులో 30 రోజులకుగాను మూడు కిలోల బియ్యం, కేజీ పప్పు, అర కేజీ ఆయిల్, 25 గుడ్లుతోపాటు వైఎస్ఆర్ పౌష్టికాహారం కింద వేరుశనగ సక్కిళ్లు, బెల్లం, రాగి పిండి, ఎండు ఖర్జూరం ఒక్కొక్కరికీ అందిస్తున్నాం.

మౌలిక సదుపాయాల పరిస్థితి ఎలా ఉంది ?

అన్ని కేంద్రాలకూ నాడు - నేడు పథకంలో భాగంగా ఫర్నీచర్, విద్యుత్తు సౌకర్యం, మంచినీటి సదుపాయం కల్పించాం. ఐసిడిఎస్ ప్రాజెక్టులో భాగంగా ఆగస్టు నాలుగు నుంచి ప్రతి నెలా మొదటి శుక్రవారం విలేజ్ హెల్త్ శానిటేషన్ డే, ఇమ్యునైజేషన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తాం. అందులో భాగంగా పిల్లలు, గర్భిణులు, బాలింతల బరువులు తీస్తాం. అలాగే ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో చనిపోయిన పేర్లు తొలగించడం, పుట్టిన వారి పేర్లు జత చేయడం వంటి సర్వేలు నిర్వహిస్తున్నాం.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సెమినార్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరమా ? శాపమా ?' అన్న అంశంపై సెమినార్ నిర్వహించారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ సమన్వయకర్త జిఎస్.రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో ముఖ్యవక్తలుగా కెఎల్.యూనివర్సిటీ ప్రొఫెసర్, స్వేచ్ఛ ఎపి ప్రధాన కార్యదర్శి శ్రీపత్ రాయ్ కోగంటి, ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, స్వేచ్ఛ ఎపి కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, గీతం యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్ పాల్గొని ప్రసంగించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఈరోజే తెరపైకి వచ్చిన కొత్త విషయమేమీ కాదని, 1940లోనే ఇది ప్రాథమిక రూపంలో ప్రారంభమైందని, ఇంతవరకు నిక్షిప్తమైన సమాచారాన్ని వినియోగించి ప్రాసెస్ చేసి కోరుకున్న ఫలితాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అందిస్తుందని తెలిపారు. ఇప్పటికే సమాచారం ఫేస్‌బుక్, గూగుల్, అమెజాన్ వంటి దిగ్గజ కంపెనీల వద్ద ఉందన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఉన్నత శిఖరాలను అందుకుంటోందనడానికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సే ఒక తార్కాణమని చెప్పవచ్చునన్నారు. మనిషి తన మేధస్సుతో తనలాగే మాట్లాడే, రాసే కృత్రిమ మేధస్సును తయారు చేయడం గొప్ప విషయమని, విద్య, వైద్యం, తదితర అనేక రంగాలలో కృత్రిమ మేధస్సును ఉపయోగించడం వల్ల మానవాళికి ఎనలేని మేలు కలుగుతుందని అన్నారు. అదే సమయంలో ఈ కృత్రిమ మేధస్సుతో అనేక రంగాల్లో పనిచేస్తున్న వారు ఉపాధి కోల్పోతారని, కొత్త టెక్నాలజీ వచ్చిన ప్రతి సందర్భంలో ఈ పరిస్థితి తలెత్తుతుందని, టెక్నాలజీ ఎవరి చేతుల్లో ఉందో దాన్ని బట్టి దానివల్ల ప్రయోజనమా, నష్టమా ? అనేది ఆధారపడి ఉంటుందని వారు తెలిపారు. కొత్త టెక్నాలజీని గుప్పెట్లో పెట్టుకున్న కార్పొరేట్లు శ్రామికులపై పెట్టే ఖర్చు తగ్గించుకుని మరిన్ని లాభాలు గుంజుకోవడం కోసం ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగిస్తారని, ఇది మంచిది కాదని అన్నారు.

సెమినార్‌లో మాట్లాడుతున్న వక్త

అలాకాకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సామాజిక ఉమ్మడి ప్రయోజనాలకు వినియోగిస్తే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. కనుక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఓ పక్క ఆహ్వానిస్తూనే.. దాని వల్ల కలిగే నష్టాలను తగ్గించుకునేటట్లు, దానిని నియంత్రించేటట్లు చర్యలు తీసుకోవడమే మార్గమని వారు తెలిపారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు గోపాలరావు, జిల్లా కార్యదర్శి ఎంవిఆర్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లకు స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ భూములను కారుచౌకగా కట్టబెడుతున్నాయని, ఆ ప్రయత్నాలను విరమించి రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లకు స్థలాలు కేటాయించి భవన నిర్మాణాలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిని డిమాండ్ చేసారు. ఆదివారం జగదాంబ దరి సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదిహేనేళ్లుగా అణగారిన తరగతులకు చెందిన విద్యార్థులు తమ హాస్టళ్లకు స్థలాలు కేటాయించి సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో మార్పులు తెస్తున్నామని చెప్పి ఉన్న స్కూళ్లను విలీనం చేయడం, హాస్టళ్లను మూసివేయడం వంటి చర్యలు చేపట్టడంతో పేద, సామాన్య విద్యార్థులకు విద్య దూరమవుతోందని అన్నారు. విశాఖలోని సాలిగ్రామపురంలో ఉన్న పోర్టు ట్రస్టుకు చెందిన 17 ఎకరాల భూమిని రహేజా సంస్థకు ఇనార్బిట్ మాల్ పేరిట 30 ఏళ్ళ లీజుకు కట్టబెట్టడం దారుణమన్నారు. నగరంలో ఆరు సంక్షేమ హాస్టళ్లు శిథిలావస్థలో ఉన్నాయని, ఏ ఒక్కదాన్ని కూడా ప్రభుత్వం నిధులు కేటాయించి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవని అన్నారు. సంఘం నాయకులు శశి కుమార్, కౌశిక్, మణికంఠ, హర్షిత్, తులసి, దివాకర్ పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE 2ND ADDL. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.P 19/2023

Between:
Chilla Sridevi ...**Petitioner**
And
1.Chilla Aruna
2.Chilla Yellamma
3.Pala adilaxmi
4.Chilla Mahalaxmi
5.Pottupu Appala Narasamma
6.Chilla Ramana Reddy
7. Boyi Prasad Reddy
8. Chilla Santoshi
9.Chilla Laxmi ...**Respondants**

నోటీసు

పై నెంబరు గల I.P No.19/2023లో పిటిషనర్ తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ, పై నెంబరు గల పిటిషన్ వేసియున్నారు. ఇందు విషయమై ఎవరికైనా ఎట్టి ఆక్షేపణలు, అభ్యంతరాలు ఉన్ననూ, పై కోర్టులో **తేది.:04-08-2023న ఉదయం గం.10-30ని॥లకు** హాజరు అయ్యి వారి యొక్క ఆక్షేపణలు తెలియజేసుకోగలరు. లేని పక్షంలో మీ పరోక్షముగా తీర్మానించబడును.

(By Order of the Court
D.Ramakrishna,
Durga Sreedevi
పిటీషనరు తరపు న్యాయవాదులు
భీమునిపట్నం. సెల్ : 9849339843

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
E.P. No. 17/2020.0.S. 157/2011

Between:
Pupireddi Lakshminarasu and another. ...**D.Hrs.**
And:
Bheesetty Satyanarayana and others. ... **J.Drs.**
To,
J.Dr. No.1
Bheesetty Satyanarayana,
Hindu, aged 67 years, resident of Raja TVS, Main Road, Gopalapatnam, Visakhapatnam.
J.Dr. No. 2
Koribilli Sanyasi Rao,
Hindu, aged 74 years, Retired Teacher, Opp: Kunchamamba Temple, Near ITI Junction, Visakhapatnam
J. Dr. No.5
Chittella Venkata Ramana,
S/o late Subba Rao, 2nd Street, Kommadi Junction, Visakhapatnam.
J.Dr. No.7
Sista Venkata Satyanarayana,
S/o late Suryanarayana Murthy, Hindu, aged 69 years, Vishnu Residency, Madhuranagar, Visakhapatnam-16.

Whereas the above named D.Hrs filed an Execution Petition against all of you and other J.Drs No. 3,4, and 6 for violation of Decree under order 21 Rule 32 of C.P.C. and all of you are hereby directed to appear before the above mentioned court **on 31-08-2023 by 10:30 A.M.** Failing which the matter will be heard and decided ex-parte.

(By order of the court)
Sri.P.Venkateswara Rao,
Sri.B.A.Raju, Sri A.Sharad Kumar,
Advocates, Bheemunipatnam.

జగనన్న ఇళ్లు.. అందనంత దూరంలో...

- ప్రచారం ఘనం... ఆచరణ అంతంత మాత్రం...
- గ్రామీణంలో 2,318 ఇళ్లు మంజూరు - పూర్తయినవి 675
- జివిఎంసి పరిధిలో పురోగతి లేని నిర్మాణాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం

"పేదలందరికీ ఇళ్లు పథకం" అట్టహాసంగా ప్రారంభించిన వైసిపి ప్రభుత్వం ఆచరణలో లక్ష్యానికి ఆమడ దూరంలో ఉందనే చెప్పొచ్చు. మండలంలోని 16 పంచాయతీలతో పాటు జివిఎంసిలో విలీన పంచాయతీలు జెవి అగ్రహారం, నిడిగట్టు, చేపలుప్పాడ, కాపులుప్పాడ, కె.నగరపాలెంలో 2,318 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు కేవలం 675 మాత్రమే పూర్తయ్యాయి. స్లాబ్ స్థాయిలో 30, రూఫ్ స్థాయిలో 157, బేస్‌మెంట్ స్థాయిలో 625 ఉండగా, ఇంకా పనులు ప్రారంభం కాని ఇళ్లు 831 ఉన్నాయి.

పెరిగిన నిర్మాణ వ్యయంతో జాప్యం

ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే ఇస్తోంది. అది కూడా మెటీరియల్ రూపంలో. ఒక్కో ఇంటి నిర్మాణానికి 20 టన్నుల ఇసుక, 485 కిలోల ఇనుము, 90 బస్తాల సిమెంట్ నేరుగా లబ్ధిదారునికి ప్రభుత్వం అందజేస్తోంది. కిటికీలు, తలుపులు, గుమ్మం, ఆశీర్వాద్ కంపెనీకి చెందిన సింథటిక్ వాటర్ ట్యాంక్, విద్యుత్ పనులు ప్రభుత్వమే చేపడుతోంది. అవసరమైన ఇటుక లబ్ధిదారులే భరించాలి. 16 అడుగుల పొడవు, 17 అడుగుల వెడల్పులో 72 చదరపు గజాల విస్తీర్ణం (సెంటున్నర స్థలం)లో ఇంటి నిర్మాణం చేపట్టాలి. నేడున్న నిర్మాణ సామగ్రి దరవరలు పెరిగాయి. ప్రభుత్వం రూపొందించిన ఇంటి డిజైన్‌కు కాస్త అటు ఇటుగా నిర్మించుకోవాలని ఎక్కువ మంది లబ్ధిదారులు భావిస్తున్నారు. వడ్డీలకు అప్పులు చేసిన వారు కొందరుండగా, చెక్కో ముక్కో పొలం అమ్మి అందంగా, కొంత విశాలంగా ఇంటి నిర్మాణం చేపట్టేవారు ఇంకొందరున్నారు. ఈ క్రమంలో ఇళ్ల నిర్మాణంలో కొంత జాప్యం జరిగిందని చెప్పవచ్చు.

జోన్ -1లో పురోగతి లేని ఇళ్లు...

భూ సమీకరణ లే-అవుట్లు ఏర్పాటు, లబ్ధిదారుల ఎంపికలో ఒడపోత, నిర్మాణ సామగ్రి వ్యయం పెరగడం లాంటి కారణాలు జివిఎంసి జోన్-1లో ఇళ్ల నిర్మాణంలో పురోగతి లేకపోవడానికి కారణాలుగా చెప్పవచ్చు. ఇక్కడి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం మెటీరియల్ రూపంలో ఇచ్చే రూ.1.80 లక్షలతో పాటు అదనంగా లబ్ధిదారుని నుంచి రూ.35 వేలు కట్టించారు. మొత్తంగా రూ.2.15 లక్షలతో 16 1/2 అడుగుల పొడవు, 17 అడుగుల వెడల్పులో ఇంటి నిర్మాణం జరుగుతోంది.

ఎంపిక చేసిన స్థలం కొండ ప్రాంతం కావడంతో చదును చేయడంలో తలెత్తే ఇబ్బందులు కూడా ఇళ్ల నిర్మాణంలో జాప్యానికి కారణాలుగా చెప్పవచ్చు. ఉపాధి ఓ చోట, నివాసం మరో చోట అనే మీమాంసలో తర్జన భర్జన పడిన కొంతమంది పేదలు వేరే గత్యంతరం లేక ఆనందపురం మండలం జగన్నాథపురం, బాకూరిపాలెం, గొట్టిపల్లి, పద్మనాభం మండలం తునివలస, గంధవరం గ్రామాల్లో కేటాయించిన ఇళ్ల స్థలాలను తీసుకునేందుకు అంగీకారం తెలిపారు.

పురోగతి లేని ఇళ్ళ నిర్మాణం

జివిఎంసి 1, 2 వార్డుల్లో ఉన్న పేదలకు ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఆనందపురం మండలం, జగన్నాథపురం, బాకూరుపాలెం లే-అవుట్లలో కేటాయించిన 2,287 ఇళ్లకు గాను, ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాలేదు. ఇందులో 901 పునాదుల స్థాయిలో 31 రూఫ్ స్థాయిలో, స్లాబ్ పూర్తయినవి 38, ప్లింత్ భీమ్ స్థాయిలో 1317 ఉన్నాయి. ఇదే మండలం గొట్టిపల్లిలో 236, పద్మనాభం మండలం తునివలసలో 719, గంధవరంలో 86 ఇళ్లు మంజూరుకాగా, ఇంకా వీటి నిర్మాణాలు ప్రారంభం కాలేదు.

చిప్పాడలో పునాదుల దశలో ఉన్న ఇల్లు

డిసెంబర్ నాటికి తొలి దశ ఇళ్లు పూర్తి

ఈ ఏడాది డిసెంబర్ నాటికి తొలి దశలో 1750 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయనున్నాం. నిర్ణీత గడువులోగా దశల వారీగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తాం. నాణ్యతా ప్రమాణాలతో ఇళ్ల నిర్మాణం చేపట్టాం.

దువ్వి శేషు బాబు
అర్బన్ ఎఇ
గృహ నిర్మాణ సంస్థ

జులై నెలాఖరుకు పూర్తి

మండలంలో తొలి దశలో జులై నెలాఖరు నాటికి 187 ఇళ్ళ నిర్మాణం పూర్తి చేస్తాం. మిగిలినవి డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం.

ఎం హుస్సేన్
రూరల్ ఎఇ
గృహ నిర్మాణ సంస్థ

నేరాలు ఘోరాలు

రుషికొండలో తిరగబడ్డ బోటు

ప్రజాశక్తి- మధురవాడ : ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ రుషికొండ బీచ్‌లో నిర్వహిస్తున్న బోటు షికారులో ఆదివారం అపశృతి చోటుచేసుకుంది. సముద్రం మధ్యలో పెద్ద అల తాకిడికి బోటు తిరగబడింది. తిరగబడ్డ సమయంలో బోటు డ్రైవర్, ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఇందులో పెందుర్తి ముషిడివాడకు ప్రాంతానికి చెందిన ఇంటి రవి(25), మధురవాడ శివశక్తినగర్‌కు చెందిన బొత్స సురేష్ (25) ఉన్నారు. లైఫ్ జాకెట్లు ధరించి ఉండటంతో డ్రైవర్ పి.లక్ష్మణరావు, ఇద్దరు యువకులు సురక్షితంగా బయటపడ్డారు. లైఫ్ గార్డులు తలుపులు, రాజు సహకారంతో బోటును, యువకులను సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు.

నోటి ఆరోగ్యంపై చైతన్యం

ప్రజాశక్తి-మధురవాడ : నోటి ఆరోగ్యంపై ప్రజలను చైతన్య పరచడంలో భాగంగా గీతం దంత వైద్యకళాశాల ఆసుపత్రి ఆధ్వర్యాన ఆర్‌కె.బీచ్‌లో ఆదివారం చైతన్య నడక, ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ఆగస్టు 1న జాతీయ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గీతం దంత కళాశాల పెరియోడాంటిక్స్ విభాగం నిర్వహించిన కార్యక్రమంలో చైర్ ప్రొఫెసర్ డాక్టర్ వై.రవిశంకర్ మాట్లాడుతూ, నోటిని ఆరోగ్యంగా ఉంచుకోవడం ద్వారా శరీరాన్ని చాలా రోగాల బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. పొగాకు సంబంధ ఉత్పత్తుల నుంచి దూరంగా ఉండటం, దంత సంరక్షణ, తరచూ బ్రష్‌లను మార్చడం, తీయటి పదార్థాలను తగ్గించుకోవడం, తాజా పళ్ళను స్వీకరించడం, దంత వైద్యులను సంప్రదించడం చేయాలని సూచించారు. దంత విద్యార్థులు నోటి ఆరోగ్యంపై బ్యానర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ వై.త్రినాథ్‌కిషోర్, ఇతర దంత వైద్యులు పాల్గొన్నారు. దాదాపు 100 మంది దంత వైద్య విద్యార్థులు బీచ్ రోడ్డులో వాకర్స్‌తో పాటు సాధారణ ప్రజలకు నోటి ఆరోగ్య ప్రాధాన్యతను తెలిపే డిజిటల్ సమాచారం ప్రదర్శించారు.

ఘనంగా రాచకొండ విశ్వనాథశాస్త్రి జయంతి

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : తాడిత, పీడిత వర్గాల జీవిత మూలాలే కథా వస్తువుగా సమాజంలో ఎన్నో సమస్యలకు అక్షర రూపాన్ని ఇచ్చి కథలుగా మలిచిన మహా మనిషి రాచకొండ విశ్వనాథశాస్త్రి అని పలువురు ప్రముఖులు కొనియాడారు. ప్రముఖ న్యాయవాది, రచయిత ఆర్‌వి.శాస్త్రి జయంతిని బీచ్ రోడ్‌లోని కిర్లంపూడిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రావిశాస్త్రి చిత్రపటానికి ప్రముఖ న్యాయవాది చీమలపాటి శ్రీరామ్మూర్తి పూలమాల వేసి అంజలి ఘటించారు. పలువురు నగర ప్రముఖులు, న్యాయవాదులు, రచయితలు పాల్గొని శాస్త్రి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

ప్రముఖ రచయిత డాక్టర్ రఘురామారావు మాట్లాడుతూ శాస్త్రి ప్రతి రచనా సామాజిక చైతన్యానికి గుర్తుగా నిలుస్తోందని వివరించారు. ఆరు సారాల కథలు, రత్తాలు రాంబాబు ఇల్లు తదితర రచనలు సజీవ శిల్పాలుగా పేర్కొన్నారు. జూనియర్ ఆర్‌వి.శాస్త్రి, న్యాయవాది శిష్ట శ్రీనివాసమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి డాక్టర్ టివి.రమణ, శాస్త్రి కుమారుడు ఉమా శాస్త్రి, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, ఉపాధ్యక్షులు బిఎస్.లత, కార్యదర్శి పైలా శ్రీనివాసు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఎన్‌వి.శాస్త్రి, సీనియర్ న్యాయవాదులు ఎం.రవి, గొలగాని అప్పారావు, రచయితలు విహారి, ఆచార్య వెలమల సిమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం

ప్రజాశక్తి తగరపువలస : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1992 బ్యాచ్ పదోతరగతి విద్యార్థి వెంకటరావు కుమార్తె దివ్య పుట్టిన రోజు సందర్భంగా స్థానిక రాజవీధిలో ఉన్న ఓ కుటుంబానికి ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వర్మ, హేమచంద్ర శేఖర్, సుబ్బారావు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 4వ వార్డు పరిధిలోని 50 మంది యువకులు జనసేనలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఎండాడలోని కార్యాలయంలో నియోజకవర్గ ఇంఛార్జి పంచకర్ల సందీప్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పాత పరదేశిపాలేనికి చెందిన ఎల్లయ్యరెడ్డితో పాటు పలువురు యువకులు పార్టీలో చేరినట్లు సందీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బివి.కృష్ణయ్య, ఎన్ఎన్.నాయుడు, పి.బాలు, జి.అప్పారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితులకు ఆపన్న హస్తం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం సాంస్కృతిక ఉన్నత పాఠశాల 2021- 22 బ్యాచ్ విద్యార్థులు ఆపదలో ఉన్న స్నేహితులకు సహాయాన్ని అందించారు. ఇటీవల మరణించిన స్నేహితులు కణితి గౌరీశ్వరరావు, చొప్ప అప్పలరాజు కుటుంబ సభ్యులకు, పక్షవాతానికి గురైన బల్లా కృష్ణ కుటుంబ సభ్యులకు నిత్యావసరకులతోపాటు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో దొంతల సంతోష్, సిడగం ప్రమీలరాణి, స్నేహితులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలి

కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి -పిఎం పాలెం : అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. జివిఎంసి 6వ వార్డు పరిధి వసంత విహార్ అపార్ట్‌మెంట్, రిక్షా కాలనీలో ఇంటింటికీ ఓటరు సర్వే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. బిఎల్‌ఒలతో కలిసి కొన్ని ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఓటర్లను కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాత వారు, కొత్తగా చేరిన వారి నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒకే వ్యక్తికి రెండు డోరు నెంబర్లలలో పేరు నమోదు కాకుండా చూసుకోవాలని, కుటుంబంలోని వ్యక్తుల ఓట్లు వేర్వేరు పోలింగ్ బూత్‌లలో నమోదై ఉంటే ఒకేచోట నమోదయ్యేలా చూడాలని బూత్ లెవెల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చినగదిలి తహశీల్దార్ సనపల రమణయ్య, ఆర్ఐ మల్లేశ్వరరావు, సూపర్‌వైజర్ యోగిత కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా షూటింగ్ బాల్ నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా షూటింగ్ బాల్ నూతన కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి -ఆనందపురం : విశాఖపట్నం జిల్లా షూటింగ్ బాల్ నూతన కార్యవర్గాన్ని జిల్లా ఇన్‌ఛార్జి భానోజీరావు ఆధ్వర్యాన ఎన్నుకున్నారు. మధురవాడలోని ది గ్లోబ్ స్కూల్‌లో నిర్వహించిన ఎన్నికకు పరిశీలకులుగా శ్రీకాకుళం జిల్లా షూటింగ్ బాల్ కార్యదర్శి మురళి వ్యవహరించారు. ప్రెసిడెంట్‌గా ఇల్లాపు వెంకటరావు, సెక్రటరీగా ముద్దాడ కిషోర్ కుమార్, జాయింట్ సెక్రెటరీగా జనార్ధనరావు, ట్రెజరర్‌గా కాశీ విశ్వనాథ్, మెంబర్లుగా సురేష్, రాజేష్, దుష్యంత్ స్వామి ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు మురళి, షూటింగ్ బాల్ విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి భానూజీరావు ప్రకటించారు.

అనందపురం మండలం, గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన ఇల్లాపు వెంకటరావు సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు. క్రీడల పట్ల యువతను ప్రోత్సహించి, క్రీడాభివృద్ధికి తమ వంత కృషి చేస్తానని వెంకటరావు హామీ ఇచ్చారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి దినపత్రిక
ఉద్యోగ అవకాశాలు

విశాఖపట్నం కేంద్రంలో మార్కెటింగ్ విభాగాల్లో పని చేయుటకు ఉద్యోగాలు ఉన్నాయి. ఆసక్తిగలవారు మా కార్యాలయానికి వచ్చి సంప్రదించగలరు.

1. గాజువాక డివిజన్ కో-ఆర్డినేటర్ (మార్కెటింగ్)
2. జాబ్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ (ప్రింటింగ్ వర్క్)
3. హెల్పర్స్ (ప్రింటింగ్ సెక్షన్)

- మొదటి ఉద్యోగానికి ఇతర పత్రికలలో మార్కెటింగ్‌లో అనుభవం ఉండాలి. టీంని లీడ్ చేసే సామర్థ్యం ఉండాలి
- 2వ ఉద్యోగానికి ప్రింటింగ్ వర్క్ ఆర్డర్లు బుక్ చేసే అనుభవం ఉన్న వారికి పాధాన్యత ఇవ్వబడును.
- 3వ ఉద్యోగానికి 10వ తరగతి/ఐ.టి.ఐ లేదా ప్రింటింగ్ సెక్షన్‌లో అనుభవం ఉన్న వారికి పాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099125, 9490099133

ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం : ప్లాట్ నెం.3, 'జి' బ్లాక్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఆటోనగర్, విశాఖపట్నం-46

పోరాటాలతో భవిష్యత్తుకు బాట

సీతారామయ్య సంతాప సభలో కెఎం.శ్రీనివాసరావు

సీతారామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కెఎం.శ్రీనివాసరావు, కుటుంబీకులు

ప్రజాశక్తి -గాజువాక : పోరాటాలు భవిష్యత్తుకు బాట వేస్తాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు అన్నారు. సిపిఎం నాయకులు ఆవు సీతారామయ్య సంతాప సభ ఆదివారం అరుణోదయ కాలనీలో ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ, అరుణోదయ కాలనీ ఏర్పాటుకు, మౌలిక సదుపాయాల కల్పనకు సీతారామయ్య చేసిన సేవలు సజీవంగా ఉంటాయన్నారు. ప్రజలకు మంచి చేద్దామనే తపనతో సీతారామయ్య ఉండేవారన్నారు. కుటుంబ సభ్యుల సహకారంతోనే ఆయన ప్రజల కోసం నిత్యం పోరాటం చేశారని తెలిపారు. అటువంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని కోరారు. సీతారామయ్య కుటుంబానికి సిపిఎం ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుందన్నారు.

సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, సీతారామయ్య మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో జిఒ 296 సంబంధించిన పట్టాలు 40 మందికి ఇవ్వలేదని, దానిపై సీతారామయ్య చేసిన పోరాటాన్ని మరవలేనిదన్నారు.

సిపిఎం నాయకులు పివివై.రమణారావు మాట్లాడుతూ, సుందరయ్య కాలనీ, అరుణోదయ కాలనీ, దశమకొండ ఏర్పాటులో సీతారామయ్య కృషిని వివరించారు. సీతారామయ్య కుమారుడు రామకృష్ణ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని తనకు తెలియకుండా క్రమశిక్షణతో తండ్రి పెంచారని చెప్పారు. తాను ప్రస్తుతం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. స్థానిక సిపిఎం నాయకులు కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో ఐద్వా నాయకులు కె.సంతోషం, పార్టీ నాయకులు నాగేశ్వరరావు, సీతారామయ్య బంధువులు మాట్లాడారు. సభ ప్రారంభంలో సీతారామయ్య చిత్రపటానికి పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, సభకు హాజరైన బంధువులు, స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : ఇటీవల విజయవాడలో ఒక న్యాయవాదిని సంఘ విద్రోహ శక్తులు హత్య చేసినందుకు నిరసనగా సోమవారం విశాఖ న్యాయవాదులు విధుల బహిష్కరణకు పిలుపునిచ్చారు. విజయవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ఆర్.ఆదిశేషు విటల్‌బాబును ప్రకాశం జిల్లా అద్దంకిలో హత్య చేశారని న్యాయవాదులు తెలిపారు. నిందితులను తక్షణమే పోలీసులు అరెస్ట్ చేయాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా డిజిపి చర్యలు తీసుకోవాలని, న్యాయవాదులకు రక్షణ చట్టం చేయాలని న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద సోమవారం ఉదయం 11:30కు చేపట్టే రాస్తారోకోను జయప్రదం చేయాలని కోరారు.

240 మందికి ఉచిత వైద్యం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 38వ వార్డు పరిధి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి టెంపుల్ ఆర్చ్ సమీపంలోని రీడింగ్ రూమ్‌లో వైసిపి నాయకులు సీతంరాజు సుధాకర్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో సుమారు 240 మందికి బిపి, సుగర్, గుండెకి సంబంధించి టుడి ఎకో టెస్ట్ నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీచేశారు. ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వాహకులు చవ్వాకుల వెంకటేశ్వరరావు (సిటీ మోటార్స్), కోట రమేష్, పోలవరపు సత్యనారాయణచారి, కోట కాత్యాయనికఇ, సీతంరాజు సుధాకర్‌కు లక్కోజు చిరంజీవి, సింహాద్రి సూరిబాబు, అడపా వేణుగోపాలరావు, బి.పార్వతీశం ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి నిత్యావసరాలు

ప్రజాశక్తి -గాజువాక : నడుపూరు హైస్కూల్ 1998-99 పదో తరగతి ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన కోరాడ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి బసా రమణారెడ్డికి ఆదివారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మిత్రుని కుటుంబానికి సరిపోయే నెలవారీ కిరాణా సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరిశెట్టి వెంకటశివ అప్పారావు, పిట్టా పైడిరెడ్డి, పెదపూడి వాసు, బలివాడ శ్రీను, సన వాసు, దర్మాల శ్రీను, కరణము సతీష్, నంబాల అప్పలరాజు, సట్టి రాంబాబు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవలో డాక్‌యార్డు ఉద్యోగులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : నేవల్ డాక్‌యార్డు కెటిబి అసోసియేషన్ ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు సమాజ సేవలోకూడా తమ వంతు పాత్ర పోషించడం ప్రశంసనీయమని అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు పేర్కొన్నారు. కాకానినగర్‌లో ఉన్న సంఘం నూతన భవన కార్యాలయంలో కార్యవర్గ సభ్యులతో కలిసి పలు అంశాలపై ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ, అసోసియేషన్ ఆధ్వర్యాన ఇప్పటికే వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారని, నిరుపేదలకు ఆపన్న హస్తం అందించారని తెలిపారు. ఉద్యోగుల్లో పేద కుటుంబాలకు అండగా ఉండాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. త్వరలోనే మెగావైద్య, రక్తదాన శిబిరం ఏర్పాటుచేయాలని నిర్ణయించారన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు బత్తుల చిరంజీవి, కార్యదర్శి భాస్కరరావు మాట్లాడుతూ, అందరి సహకారంతో సంఘం నూతన భవన కార్యాలయం ప్రారంభించామని, ప్రస్తుతం మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి సహకారంతో హాల్, రెండు గదులు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి సౌలభ్యం కోసం ఈ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. సంఘం సభ్యులు తేజతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఏకరూప పౌరస్మృతిపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార మానవ వికాస వేదిక ఎపి శాఖ ఆధ్వర్యాన ఆదివారం పౌర గ్రంథాలయంలో ఏకరూప పౌరస్మృతి అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ, యూనిఫామ్ సివిల్ కోడ్ ఉద్దేశాలు ప్రజలకు తెలియజేయకుండా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టడం సమంజసం కాదన్నారు. దళిత హక్కుల సంఘం అధ్యక్షులు కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన యూనిఫాం సివిల్ కోడ్‌ను మార్పులు చేయడానికి 2016లో చర్యలు చేపట్టి విరమించుకున్న కేంద్ర ప్రభుత్వం మళ్లీ ఇప్పుడు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.

మానవ వికాస వేదిక కేంద్ర కమిటీ సభ్యులు బి.సాంబశివరావు మాట్లాడుతూ, దేశంలో ప్రజలకు సరైన అవగాహన కల్పించి, చర్చకు పెట్టి, దానివల్ల లాభనష్టాలను తెలుసుకోవాలన్నారు.

60 మీటర్లకు పెంచితే తీవ్ర నష్టం

బిఆర్‌టిఎస్ బాధితుల సమావేశంలో గంగారావు

సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం తొలి పావంచా నుంచి అడవివరం వరకు బిఆర్‌టిఎస్ రోడ్డును 60 మీటర్లకు విస్తరిస్తే బాధితులు తీవ్రంగా నష్టపోతారని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పేర్కొన్నారు. బిఆర్‌టిఎస్ బాధితుల సమావేశం ఆదివారం సాయంత్రం అడవివరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి గంగారావు హాజరై మాట్లాడారు. బిఆర్‌టిఎస్ బాధితులకు నోటీసు ఇచ్చినప్పుడు 100 అడుగుల రోడ్డు వేస్తామని చెప్పి ఈ నెల 23వ తేదీన పేపర్ ప్రకటనలో 60 మీటర్ల రోడ్డుకు జివిఎంసి మాస్టర్ ప్లాన్‌లో ఆమోదం పొందిందని పేర్కొన్నారని తెలిపారు. దీని వల్ల బాధితులు తీవ్రంగా నష్టపోతున్నందుకు నిరసనగా సోమవారం ఉదయం 7 గంటలకు పాత అడవివరం జంక్షన్ నుంచి ఘోషాల వరకు పాదయాత్ర చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో బాధితులు టీవీ.కృష్ణంరాజు, సిహెచ్.సత్యనారాయణ, లంక అప్పలరాజు, ఆల్తి నాగమణి, పిల్లి సుకన్య తదితరులు పాల్గొన్నారు.

'గంగవరం' మొండి వైఖరి : ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అదాని గంగవరం పోర్టు యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా నిర్వాసిత కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసనదీక్షలు ఆదివారం నాటికి 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి ఆదివారం సందర్శించి మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వాసిత కార్మికులు పలు దఫాలు చర్చలు నిర్వహించినప్పటికీ యాజమాన్యం నుండి స్పష్టత రాలేదన్నారు. సజ్జల రామకృష్ణ, వైవి సుబ్బారెడ్డి ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల సమస్యలను తీసుకెళ్లానని చెప్పారు. దీనిపై నోట్ తయారుచేయాలని చీఫ్‌సెక్రటరీని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. వేతనాల విషయంపై అదానీ యాజమాన్యంతో మాట్లాడాల్సి ఉందని, త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందని తెలిపారు. మంగళవారం విశాఖ వస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వద్దకు కార్మికులను తీసుకెళ్తానని చెప్పారు. సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కోవిరి అప్పలరాజు, యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు, వాసుపిల్లి యల్లాజీ, మాదా అప్పారావు, గంటిపిల్లి అమ్మోరు, నొల్లి స్వామి, గంటిపిల్లి లక్ష్మయ్య, కదిరి సత్యానందం, కొవిరి అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌తో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి -ములగాడ : ఇంటర్న్‌షిప్‌లలో విద్యార్థినులు భాగం పంచుకోవడం వల్ల వారికి వాస్తవిక విషయాల పట్ల అవగాహన ఏర్పడిందని, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడ్డాయని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి తెలిపారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థినుల ఇంటర్న్‌షిప్ మూల్యాంకన ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంటర్న్‌షిప్‌లకు అవకాశం ఇచ్చిన హెచ్‌పిసిఎల్, కోరమాండల్, స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డ్ తదితర పరిశ్రమలకు, టెక్ మహీంద్రా, అనుదీప్, విజె ఇన్ఫో వంటి ఐటి సంస్థలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ఇంటర్న్‌షిప్ ఇన్‌ఛార్జి వై.అనసూయాదేవి మాట్లాడుతూ, 90 రోజులపాటు డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థినులు ఇంటర్న్‌షిప్‌ను చేయడం ఎంతో ఆనందదాయకమని, దీనివల్ల వారిలో నైపుణ్యాలు పెరిగాయని, దాదాపు 3 వంతుల మందికి ఇంటర్న్‌షిప్ అవ్వగానే ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో ఇంటర్న్‌షిప్‌ల మెంటార్లు, విద్యార్థినులు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. ఇంటర్న్‌షిప్‌లలో పాల్గొన్న విద్యార్థినులకు గ్రేడ్స్‌ను, మెంటార్లకు ప్రశంసా పత్రాలను అందించి ప్రిన్సిపల్ అభినందించారు.

'పావనీస్'లో అత్యాధునిక కంటి వైద్యం

డాక్టర్ పావనీస్ బెస్ట్ విజన్ అడ్వాన్స్‌డ్ ఐ హాస్పిటల్ వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-ఉక్కునగరం : గాజువాకలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలను డాక్టర్ పావనీస్ బెస్ట్ విజన్ అడ్వాన్స్‌డ్ ఐ హాస్పిటల్ అందిస్తోంది. విశాఖలోనే అరుదుగా ఉన్న లామినర్ ఐ ఆపరేషన్ థియేటర్ ఈ ఆస్పత్రిలో ఉంది. కాటరాక్ట్, లాసిక్ ఆపరేషన్లను ఉన్నత ప్రమాణాలతో ఎలాంటి నొప్పి లేకుండా 15 నిమిషాల్లో ముగించి గంట లోపు రోగిని డిశ్చార్జ్ చేసి పంపించడం ఇక్కడ ప్రత్యేకతగా ఉంది. ఆప్టికల్ కోహరెన్స్ టోమోగ్రఫీ ఓ సిటీ మెషిన్ ఇక్కడ అందుబాటులో ఉంది. వెయ్యి రూపాయలు నుంచి ఒసిటి మెషిన్‌లో ఇక్కడ కంటి పరీక్షలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. పెద్ద ఇన్స్యూరెన్స్ కంపెనీలు కూడా తమతో అనుసంధానమై ఉన్నాయని తెలిపారు. కంటికి సంబంధించిన అన్ని శస్త్ర చికిత్సలు, పరీక్షలతో పాటు ఆపరేషన్ థియేటర్, 21 పడకలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అతి తక్కువ ఖర్చుతో ఉన్నత ప్రమాణాలతో కంటికి సంబంధించిన చికిత్సను అందించాలని ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు డాక్టర్ పావని తెలిపారు.

ఇక్కడ పనిచేసే డాక్టర్ పావని వాడపల్లి కంటి శుక్లాలు పాకో రిఫ్రాక్టీవ్ సర్జన్‌గా రాజమండ్రి అకీర కంటి ఆస్పత్రిలో కాటరాక్ట్ సర్జరీలో ఫెలోషిప్ తర్వాత సర్జన్‌గా 8 సంవత్సరాలు అనుభవం గడించారు. ఒక సంవత్సరంలోనే 200 పైగా కంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేసినట్లు తెలిపారు. ఆదివారం కూడా తాము అందుబాటులో ఉంటామని వెల్లడించారు.

ఐక్య పోరాటంతోనే శ్రామిక మహిళల హక్కుల సాధన

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రామిక మహిళల హక్కుల సాధనకు ఐక్య పోరాటానికి సన్నద్ధం కావాలని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకురాలు రమాదేవి అన్నారు. ఆదివారం అనకాపల్లి దొడ్డి రామునాయుడు భవనంలో గూనూరు వరలక్ష్మి అధ్యక్షతన శ్రామిక మహిళల సమన్వయ కమిటీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళా కార్మికులు, ఉద్యోగులు లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు మరుగుదొడ్లు, పిల్లలను ఆడించడానికి సౌకర్యాలు లేవన్నారు.

దేశ సంపదను సృష్టించడంలో అగ్రభాగంలో ఉన్న మహిళలు ఇంటి, వంటపనితో పాటు బయట పనులు చేయాల్సిన పరిస్థితులు వచ్చాయని ఆవేదన

మాట్లాడుతున్న శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర నేత రమాదేవి

వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లాలో బ్రాండిక్స్, జీడిపిక్కల కంపెనీలు, దుకాణాలు, ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వేలాదిమంది అసంఘటిత రంగ కార్మికులకు ఎటువంటి చట్టాలు అమలు కావడం లేదని వాపోయారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ మతోన్మాద పోకడలతో మహిళల్ని చిన్నచూపుతో వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కోట్లాదిమంది మహిళలకు ఉద్యోగ భద్రత లేదన్నారు. సమస్యలపై శ్రామిక మహిళలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు, విఎఎ రాష్ట్ర అధ్యక్షురాలు సిహెచ్ రూపాదేవి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఇ.పార్వతి, శాంతి, సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకులు, ఆచార్య వ్యవసాయ రంగ యూనివర్సిటీ కాంటాక్ట్ వర్కర్స్ నాయకులు మాట్లాడారు. సదస్సులో జిల్లా నలుమూలల నుంచిఅధిక సంఖ్యలో మహిళ నాయకులు పాల్గొన్నారు.

ఐద్వా పోరుయాత్రకు ఘన స్వాగతం పలకాలి

ప్రజాశక్తి -అనకాపల్లి :మహిళలపై హింస, మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా పోరు బస్సు యాత్ర సోమవారం అనకాపల్లి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో విజయవంతం చేయాలని ఐద్వా నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో మాట్లాడుతూ ప్రజాసంఘాలు, మహిళలందరూ ఘన స్వాగతం పలుకుతూ ఈ యాత్రను ఆహ్వానించాలని కోరారు. ఉదయం 9 గంటలకు సబ్బవరం, ఉదయం 9:30గంటలకు అనకాపల్లి రైతు బజారులో, 10:30 గంటలకు ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర, 11 గంటలకు కశింకోట, 11:30 గంటలకు మునగపాక, ఒంటి గంటకు అచ్యుతాపురం, ఒంటి గంటన్నరకు ఎలమంచిలి, నాలుగు గంటలకు అడ్డరోడ్డు, నాలుగున్నరకు నక్కపల్లి ప్రాంతాల్లో సభలు ఉంటాయన్నారు. మద్యాన్ని నియంత్రించాలని, మత్తు పదార్థాలు అరికట్టాలని, వివిధ కళారూపాల్లో పాటల పాడుతూ నాట్యాలు చేస్తూ గ్రామాలు, కాలేజీల్లో సదస్సులు జరుపుతూ ఈ బస్సు యాత్ర సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పిల్లి మాణిక్యం, జాయింట్ సెక్రటరీ వరలక్ష్మి, రూపా దేవి, వరలక్ష్మి, వరలక్ష్మి, శ్రీదేవి, శాంతి పాల్గొన్నారు.

టిడిపితో మహిళల ఆర్థికాభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-.అనకాపల్లి : మహిళల ఆర్థికాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని, టిడిపి అధికారంలోకి రాగానే 18ఏళ్ళు నిండిన ప్రతి ఆడబిడ్డకు నిధి పథకంలో భాగంగా నెలకు రూ.15 వందల ఆర్థికసాయం అందిస్తామనిమాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక నెయ్యిల వీధిలో ఇంటింటికి వెళ్లి మహాశక్తి పథకం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు చిత్రపటానికి మహిళలు పెద్ద ఎత్తున పాలాభిషేకం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మహిళలందరూ కోరుకుంటున్నారన్నారు.మహా శక్తి పథకంతో మహిళలు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. జగన్‌రెడ్డి కొంతమందికే అమ్మ ఒడి పథకం ఇస్తున్నారని, టిడిపి అధికారంలోకి రాగానే కుల మతాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు ఇస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం తొలగించిన పేదల పింఛన్లను పునరుద్దరిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు కొణతాల రత్న కుమారి, బిఎస్ఎంకె జోగినాయుడు, సంకర్ల పద్మలత, పచ్చికూర రాము, ఐత్తుల శ్రీనివాసరావు, బండారు రామారావు, సత్యవతి, భీశెట్టి హేమా, గణపతి, ఈశ్వరరావు, మహిళలు, యువత పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆందోళనలకు సిఐటియు, ఎఐటియుసి సంఘీభావం

ప్రజాశక్తి- అనకాపల్లి : విద్యుత్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కారించాలని సిఐటియు, ఎఐటియుసి నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో ఎఐటియుసి రాష్ట్ర సమితి పిలుపుమేరకు అనకాపల్లి సమితి కన్వీనర్ కోన లక్ష్మణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. విద్యుత్ ఉద్యోగుల సమస్యల్ని యాజమాన్యాలు, ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు.ఉద్యోగులకు కొత్త పిఆర్‌సిలోనైనా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ అధ్యక్షులు ప్రేమ చంద్ర శేఖర్ మాట్లాడుతూ విద్యుత్‌ను మార్కెట్ సరుకుగా మార్చే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుటిల యత్నాలను ఉద్యోగులు తీవ్రంగా నిరసించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ సంస్కరణలకు తీవ్ర ప్రతిఘటన రావడంతో దొడ్డిదారిన స్మార్ట్ మీటర్లను ప్రవేశ పెడుతున్నారని విమర్శించారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ కార్మిక సంఘాల నేతలు

ఈ నెల 31న జిల్లా కలెక్టర్లకు వినతిపత్రం, ఆగస్టు 2న అన్ని సర్కిల్ కార్యాలయాలు, ఉత్తరక కేంద్రాలు వద్ద, 7న తిరుపతిలో ఎపిఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ముందు ధర్నాలు చేయాలని నిర్ణయించారు.17న ఛలో విద్యుత్ సౌధను జయప్రదం చేయాలని సమావేశం కోరింది. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వాయిబోయిన శేఖర్, బండారు వెంకటేష్, విత్తనాల పోతురాజు, సూర్యనారాయణ, సత్యనారాయణ, విద్యుత్ ఉద్యోగసంఘం నాయకులు కొరాన మాధవి, దాడి అప్పారావు, సిఐటియు నాయకులు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

మండల సమన్వయ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా వంద్రపు సోమునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అచ్యుతాపురంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఉత్తల శంకర్రావు సమక్షంలో మండలంలోని అన్నికార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది

కన్వీనర్ సోమునాయుడు

ప్రతినిధులతో కమిటీ ఏర్పాటుచేయగా, కమిటీ కన్వీనర్‌గా సోమునాయుడు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు శంకరరావు మాట్లాడుతూ, కార్మికులకు ఉన్న హక్కులను తీసేసి ప్రైవేటు యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయనున్నట్లు తెలిపారు. కార్మికులందరికి కనీస వేతనాలు, ఇఎస్‌ఐ, పిఎఫ్, బోనస్సు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో ప్రమాదాలు అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, విజయ, మంగమ్మ, విశ్వేశ్వరరావు, సత్తిబాబు పాల్గొన్నారు

మాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- అనకాపల్లి :మిత్రా అసోషియేషన్ ఫర్ సోషల్ సర్వీస్ (మాస్) ఆధ్వర్యంలో అనకాపల్లి మున్సిపల్ హైస్కూల్, 1988 బెస్ట్ క్లాస్‌బ్యాచ్ విద్యార్థుల సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగే స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ ఎఎస్ రాజా వాలంటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో స్థానిక సిటీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో మాస్ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులు సుమారు 60 యూనిట్లు రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న మాస్ సభ్యులు, పూర్వ విద్యార్థులు

ఘనంగా డాక్టర్ నారాయణరావు జన్మదిన వేడుకలు



డాక్టర్ నారాయణరావుకు కేకు తినిపిస్తున్న నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి: రాష్ట్ర విధాన పరిషత్ మౌలిక వసతుల సంస్థ మాజీ డైరెక్టర్, పౌర్ణమి సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కెకెవి. నారాయణరావు జన్మదిన వేడుకలు ఆదివారం అనకాపల్లి టిడిపి పార్లమెంటరీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా నారాయణరావుకు గజపూలమాల వేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. . ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ టిడిపి సీనియర్ నేత నారాయణరావు పార్టీకి చేసిన సేవలను మరువలేమన్నారు. డాక్టర్ వృత్తిలో ప్రజా సేవకు అంకితమై, పార్టీ కార్యక్రమాల పట్ల నిబద్ధతతో పని చేస్తున్నారన్నారు. పార్టీ ఆయన సేవలను గుర్తించి జిల్లా ఉపాధ్యక్షులు, పట్టణ శాఖ అధ్యక్షునిగా,రాష్ట్ర విధాన పరిషత్ మౌలిక వసతుల సంస్థ డైరెక్టర్ గా చంద్రబాబు నియమించారని గుర్తు చేశారు. అలాగే పౌర్ణమి సేవాసంస్థ ద్వారా పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ నిర్వహించి ఎనిమిదేళ్లుగా ఎంతోమంది విద్యార్థులకు ఉచిత శిక్షణనిచ్చి, ఉన్నత విద్యకు అవకాశాలు కల్పించారన్నారు. ఎంతోమంది పేదలకు బీమా పాలసీలు చేయించారని, ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించారన్నారు. భవిష్యత్తులో పార్టీలో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని నాగ జగదీశ్ ఆకాంక్షించారు.కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాసరావు, కొట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, కుప్పిలి జగన్, మళ్ల శివన్నారాయణ, బొడ్డేడ జోగినాయుడు, మళ్ల సురేంద్ర, బొద్దపు ప్రసాద్, ధనాల విష్ణు చౌదరి, కొట్ని బాలాజీ, సబ్బవరపు గణేష్, మళ్ల గణేష్, బొడ్డేడ మురళి, పొలిమేర నాయుడు, దూలం ప్రసాద్, కాయల ప్రసన్నలక్ష్మి, బీశెట్టి హేమ, కొట్ని ఉమ, వేదుల సూర్యప్రభ, కొణతాల రత్నకుమారి, ముప్పన గిరిజ పాల్గొన్నారు.

తీడలో చీరల పంపిణీ

కశింకోట : అనకాపల్లి పట్టణ టిడిపి అధ్యక్షుడు డాక్టర్ కెకెవి.నారాయణరావు జన్మదినం సందర్భంగా కశింకోట మండలంలోని తీడ గ్రామంలో 120 మందికి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిరికి సన్యాసి నాయుడు,మెడిశెట్టి సన్యాసి నాయుడు, రుత్తల అప్పలరాజు పాల్గొన్నారు

మల్లేశ్వరరావు సేవలు మరువలేనివి

మల్లేశ్వరరావును సత్కరిస్తున్న అధ్యాపకులు, స్థానికులు

ప్రజాశక్తి -సబ్బవరం : మండలంలోనిఅంబేద్కర్ గురుకులం కళాశాలలో పౌరశాస్త్ర అధ్యాపకులుగా విధులు నిర్వహించి, ఉద్యోగవిరమణ చేసిన కర్రి మల్లేశ్వరరావు సేవలు మరువలేనివని విశాఖ, అనకాపల్లి జిల్లాల సమన్వయ అధికారి ఎస్. రూపావతి అన్నారు. ఆదివారం స్థానిక సీతారామ కల్యాణ మండపంలో ఉద్యోగవిరమణ చేసిన మల్లేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రూపావతి మాట్లాడుతూ మల్లేశ్వరరావు 33ఏళ్లుగా పిజిటిగా, లెక్చరర్ గా ఎంతోమంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దారని ఆయన సేవలను కొనియాడారు.ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. శ్రీకాకుళం జిల్లా సమన్వయ అధికారి బాలాజీ నాయక్ మాట్లాడుతూ మల్లేశ్వరరావు అధ్యాపకులుగా అందించిన సేవలు ఎనలేనివన్నారు. అనంతరం మల్లేశ్వరరావు దంపతులకు ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో రిటైర్డ్ జోనల్ అధికారి జనార్దనరావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ వి. శేషుకుమారి, రిటైర్డ్ సమన్వయ అధికారి ఆర్‌డివి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు జీవాల పెంపకందారుల 'చలో విజయవాడ'

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ గొర్రెలు మేకలు పెంపకందారులు సంఘం ఆధ్వర్యంలో జులై 31న నిర్వహించే చలో విజయవాడను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్ కోరారు .ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ జీవాల పెంపకందారులకు రూ. పదివేల కోట్లు కేటాయించి, ప్రతి పెంపకందారునికీ 50శాతం సబ్సిడీతో రూ.5 లక్షల రుణం ఇవ్వాలని, గొర్రెల సహకార సంఘాలకు ఎన్‌సిడిసి రూ.88 కోట్ల నిధులను విడుదల చేయాలని, 90 శాతం సబ్సిడీతో ఉపాధి హామీ నిధులతో షెడ్లు నిర్మించాలని, 50 సంవత్సరాలు నిండిన గొర్రెలు మేకలు పెంపకందార్లకు పింఛన్ మంజూరు చేయాలని, అన్ని గొర్రెలు, మేకలకు ఉచిత ఇన్సూరెన్స్ ద్వారా పశు నష్ట పరిహారం ఇవ్వాలని, పశువైద్యులు, ఆర్‌బికెలలో సిబ్బంది ఖాళీ పోస్టులను వెంటనే భర్తీచేయాలని డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకలకు సరిపడా టీకాలు మంజూరు చేయాలని కోరారు. ఏటా నాలుగుసార్లు నట్టల నివారణ వ్యాక్సినేషన్ చేయాలని, ఆర్‌బికెలకు నెలకు రూ.10వేల విలువైన మందులు ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికి మేలురకం విత్తన పొట్టేళ్ళ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు 31న సోమవారం విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద ధర్నా చేస్తున్నట్లు వెల్లడించారు.

మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

ముగిసిన అంతర్ జిల్లాల గ్రాప్లింగ్ పోటీలు

బహుమతులు అందజేస్తున్న దినేష్ కపూర్

ప్రజాశక్తి-అనకాపల్లి : మూడవ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ కాడెట్స్ బాల బాలికల గ్రాప్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ గ్రాప్లింగ్ అసోసియేషన్ ఛైర్మన్ దినేష్ కపూర్, గౌరవ అతిథిగా పద్మనాభం, లక్ష్మణరావు, పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి కెవిఎన్ సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేషన్ కార్యనిర్వాహక సురేందర్ ఒడ్డి, పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి టి జ్యోతిర్మయి పాల్గొన్నారు. ఈ పోటీలలో ఆల్‌రౌండ్ ఛాంపియన్‌షిప్‌ను, మొదటి స్థానాన్ని తిరుపతి జిల్లా జట్టు కైవసం చేసుకోగా, రెండవ స్థానంలో అనంతపురం జిల్లా, మూడో స్థానాన్ని అనకాపల్లి, విశాఖపట్నం ఉమ్మడి జిల్లా క్రీడాకారులు దక్కించుకున్నారు.కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

నూకాంబికకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -కశింకోట : మేజర్ పంచాయతీ కశింకోటలో ని నూకాంబిక అమ్మవారిని రైటర్స్ అకాడమీ చైర్మన్, లీడర్ పత్రిక సంపాదకులు వివి రమణమూర్తి.ఆదివారం దర్శించుకున్నారు అయనతోపాటు నందవరపు వెంకటేశ్వర్ రెడ్డిని ఆలయం కమిటీ శాలువా కప్పి, అమ్మ వారి చిత్ర.పటాలు అందజేశారు కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు వేగి గోపికృష్ణ, ఆలయ ధర్మకర్త వేగి రామరాజు గణపతి సిద్ధిరెడ్డి శ్రీను, కాంగ్రెసు సతీష్ పాల్గొన్నారు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సతీమణి విజయలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ళ సురేంద్ర, గొంతిని శ్రీనివాసరావు, నైనంశెట్టి రమణ రావు బుదిరెడ్డి గంగయ్య ,క్రి దుర్గి నాయుడు, జెర్రిపోతుల నూకి నాయుడు పాల్గొన్నారు

నివాసయోగ్యంగా ఇళ్లు నిర్మించాలి

జగనన్న లేఅవుట్లలోని ఇళ్లను పరిశీలిస్తున్న జనసేన నేతలు.

ప్రజాశక్తి-సబ్బవరం : జగనన్న లేఅవుట్లలో లబ్దిదారులైన పేదల కుటుంబాల నివాసయోగ్యంగా జగనన్న ఇల్లు నిర్మించాలని జనసేన నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పైడివాడ అగ్రహారంలో వర్షాలకు దెబ్బతిన్న జగనన్న లేఅవుట్‌లోని ఇళ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జనసేన నేతలు మండల కన్వీనర్ కర్రి కనకరాజు, కో కన్వీనర్ సబ్బవరపు రవి మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త తమ్మిరెడ్డి శివశంకర్ సూచనలతో పైడివాడ అగ్రహారం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న జగనన్న కాలనీని సందర్శించామన్నారు. తొలకరి వర్షాలకే జగనన్న లేఅవుట్లలోని ఇళ్లన్నీ గాల్లో తేలుతున్నట్లు తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పునాదులు గాల్లో తేలుతుంటే వాటిపై ఇంటినిర్మాణం చేపడితే ఎన్నాళ్లు నిలుస్తుందో అధికారులే చెప్పాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే, ఎంపీలతోపాటు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఈరోతి తరుణ్‌కుమార్, పిన్నింటి పార్వతి, జుత్తాడ శ్రీనివాసరావు, మోటూరు చైతన్య, సాలాపు సతీష్, మండల భాస్కర్, తనకాల శ్రీనివాసరావు, లక్ష్మీ గోవింద్, సుంకర శివ, బలిరెడ్డి అప్పలరాజు, కరణం పండు పాల్గొన్నారు.

పరిశ్రమల విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలి

అచ్యుతాపురంలో సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ

సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : రాష్ట్రంలో ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం అచ్యుతాపురంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము మాట్లాడుతూ ఏప్రిల్ నెల నుంచి పరిశ్రమలపై యూనిట్‌కు రూ.1.45 పెంచార న్నారు. పెంచిన విద్యుత్‌ఛార్జీలు కారణంగా పరిశ్రమలపై సంవత్సరానికి రూ.700 కోట్ల భారం పడుతుందన్నారు. విద్యుత్ ఛార్జీల అదనపు భారంతో పరిశ్రమల నిర్వహణ కష్టమౌతోందని, ఫలితంగా రానున్న కాలంలో పరిశ్రమలు మూతబడి, వాటిపై ఆధారపడే కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందనిఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్‌ను పూర్తిగా ప్రైవేటీకరించి, ప్రైవేటు కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం ప్రజలపై భారాలు వేస్తుందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుతో ఇప్పటికే అంతంత మాత్రమే నడుస్తున్న పరిశ్రమలు మనుగడ ప్రశ్నార్థకం కానుందన్నారు. పెంచిన కరెంటు ఛార్జీలు తగ్గించాలని, మంగళవారం విజయనగరంలో జరిగే రాష్ట్ర సదస్సుకు కార్మికులంతా అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నిరసన ర్యాలీలో సమన్వయ కమిటీ కన్వీనర్ కె.సోమునాయుడు, సత్యం, రాజు అభిజిత్, ఆంజనేయ, మైతాన్ కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

మీనామృతం తయారీపై అవగాహన

రైతులు, మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌ఛార్జి రమణ

ప్రజాశక్తి -కశింకోట : ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుపై అవగాహనలో భాగంగా ఆదివారం మండలంలోని నూతన గుండుపాలెం గ్రామంలో మీనామృతం (చేపబెల్లం) ద్రావణం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. మీనామృతం తయారీని ప్రయోగాత్మకంగా చేసి చూపించి, దాని ప్రయోజనాలను వివరించారు. ఈసందర్భంగా మండల ఇన్‌చార్జి రమణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం విధానంలో సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారని, వారికి అవసరమైన సేవలను ఆర్‌బికెలు ద్వారా, ప్రకృతి వ్యవసాయ యంత్రాంగం అందిస్తుందన్నారు. రైతులు మహిళలు సిబ్బంది పాల్గొన్నారు

మైక్రో సర్జరీ, మైక్రోవాస్కులర్‌పై సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో తొలిసారిగా ఎన్ఎస్ఐ న్యూరోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ జోనల్ మైక్రో న్యూరో సర్జరీ, మైక్రోవాస్కులర్ సూచరింగ్‌పై వర్క్‌షాప్‌ను శని, ఆదివారాల్లో ఓ హోటల్‌లో నిర్వహించారు. విశాఖపట్నంలోని అపెక్స్ ఐఒఎన్ఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి న్యూరో సర్జరీ ప్రతినిధులు హాజరయ్యారు. మైక్రో సూచరింగ్ టెక్నిక్స్, మైక్రోవాస్కులర్ సూచరింగ్‌లో తగు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యూరోసర్జన్లు డాక్టర్ కె.శ్రీధర్ (చెన్నయ్), డాక్టర్ పరితోష్ పాండే (బెంగళూరు), డాక్టర్ విను గోపాల్ (కొట్టాయం), డాక్టర్ సందీప్ తలారి (విశాఖపట్నం) అధ్యాపకులుగా ఉన్నారు. డాక్టర్ కె.ప్రవంత్ (న్యూరోసర్జన్, అపెక్స్ ఐఒఎన్ఎస్ హాస్పిటల్) సమన్వయకర్తగా వ్యవహరించారు. డాక్టర్ జి.బుచ్చిరాజు (ప్రిన్సిపల్, ఆంధ్రా మెడికల్ కాలేజ్), డాక్టర్ కె.సత్య వరప్రసాద్ (మాజీ డిఎంఇ, మాజీ ప్రొఫెసర్ న్యూరోసర్జరీ) తదితరులు హాజరయ్యారు.

కంప్యూటరీకరణ దిశగా జనమిత్ర సేవలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : కంప్యూటరీకరణ దిశగా జనమిత్ర బ్యాంకు సేవలు అందిస్తోందని ఆ బ్యాంకు సిఇఒ కర్రి రమేష్ బాబు అన్నారు. ఆదివారం తిమ్మరాజుపేట గ్రామంలో కెఎస్ఆర్ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జనమిత్ర బ్యాంక్ 28వ ప్రాతినిధ్య సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు ప్రారంభం నుంచి నేటికీ ఐదు మండలాల్లో 150 గ్రామాల్లో 15 వేల మంది సభ్యులతో విస్తరించబడిందన్నారు. డిపాజిట్లు సేకరణ. రుణాల మంజూరు తదితర కార్యకలాపాలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు లావాదేవీలలో మహిళలుకీలకమైన పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మునగపాక ఎంపిపి మళ్ల జయలక్ష్మి, బ్యాంకు చైర్మన్ కరణం కాంతమ్మ, వైస్ చైర్మన్ గెంటకశెట్టి పెదలక్ష్మి, బ్రాంచ్ మేనేజర్ బలిరెడ్డి అప్పారావు, ఎంఎఆర్‌డిఎస్ ప్రసాద్, శరగడం రామలక్ష్మి పాల్గొని మాట్లాడారు. ఉత్తమ సేవలు అందించిన వారికి బహుమతులు అందజేశారు.

బహుమతులను అందజేస్తున్న ఎంపిపి ,తదితరులు

చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి : వచ్చేనెల 8న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అనకాపల్లి జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా అనకాపల్లి పార్లమెంట్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొని, చంద్రబాబు పర్యటనపై నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, పార్లమెంటరీ కమిటీ సభ్యులతో చర్చించారు. చోడవరం నియోజవర్గంలో సాగునీరు ప్రాజెక్ట్ బాబు జగ్జీవన్‌రామ్ సుజల స్రవంతి శంకుస్థాపన చేసిన స్థలాన్ని పరిశీలిస్తారని,అనంతరం మాడుగుల గ్రామంలో బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. అనకాపల్లి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనితీరు, రైతన్న ఇబ్బందులు, వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలు, తెలుగుదేశం పార్టీ ఎన్నికల మినీ మేనిఫెస్టో విషయాలను ప్రజలకు వివరిస్తారని జిల్లా అధ్యక్షులు నాగ జగదీష్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, శాసన మండలి సభ్యులు వేపాడ చిరంజీవిరావు, నియోజవర్గ ఇన్చార్జిలు అనకాపల్లి పీలా గోవింద సత్యనారాయణ, మాడుగుల పి వి జి కుమార్, యలమంచిలి ప్రగడ నాగేశ్వరరావు, చోడవరం బత్తుల తాతయ్య బాబు, మాజీ శాసన సభ్యులు గవిరెడ్డి రామానాయుడు, కే ఎస్ ఎన్ రాజు, పార్లమెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, రాష్ట్ర కమిటీ సభ్యులు కోట్ని బాలాజీ, దూళి రంగనాయకులు, మళ్ల సురేంద్ర, ఏపీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

చంద్రబాబు పర్యటనపై మీమాంస

- మరోసారి బయటపడ్డ టిడిపి నేతల విభేదాలు

ప్రజాశక్తి-మాడుగుల:రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల కోసం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు రాష్ట్ర పర్యటన కోసం నిర్ణయం తీసుకోగా, అనుకోకుండా ఇందులో భాగంగా మాడుగుల పర్యటన ఖరారు అయ్యింది. మండలంలోని తాచేరు జలాశయం పరిశీలిస్తారని, ఇందుకు కార్యక్రమం ఖరారు కాగా, ఈ పర్యటన నేపథ్యంలో నేతల మధ్య మరో సారి ఆధిపత్య పోరు కనబడుతుంది. ఇప్పటికే మాడుగుల టిడిపి మూడు ముక్కలాటగా తయారు కాగా, రోజు రోజుకు గ్రూపుల వివాదాలు చెల రేగుతున్నాయి. ఇన్‌ఛార్జ్ పదవిని పివిజి కుమార్‌కు అప్పగించడంతో మాజీ ఎమ్మెల్యే రామానాయుడు వర్గం తమ ప్రాబల్యం కోసం, ఆయన సైతం పార్టీ కార్యక్రమాలు విడిగా నిర్వహిస్తున్నారు. మరో నేత పైలా ప్రసాదరావు సైతం నిరంతర పార్టీ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వైసిపి ఎమ్మెల్యే బూడి ముత్యాల నాయుడు కు మంత్రి పదవి లభించడంతో నియోజకవర్గం లో ప్రధాన రహదారులు మినహా, ఇతర రహదారుల నిర్మాణం, ఇతర అబివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ బలం పెంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో చంద్ర బాబు నాయుడు పర్యటన వాస్తవంగా తారువ జలాశయం పరిశీలన ఖరారు కాగా, మాడుగుల పర్యటన కూడా ఖరారు అయ్యింది. కానీ ఈ పర్యటన కే.కోటపాడులో ఖరారు చేసేందుకు పివిజి కుమార్ ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. తారువ జలాశయం పరిశీలన తరువాత కోటపాడులో బహిరంగ సమావేశం ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతుండగా మాడుగుల పర్యటన కోసం రామా నాయుడు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఆదివారం అయ్యన్న పాత్రుడు ను కలసి ఎలాగైనా చంద్రబాబు పర్యటన మాడుగులలో ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిసింది. మరో పక్క కుమార్ అధినేత పర్యటన కోటపాడులో ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. గతంలో గ్రూపుల విషయంలో చంద్రబాబు నాయుడు నేతలకు గట్టి వార్నింగ్ ఇచ్చినా వీళ్ళ వైఖరి మారక పోగా, అధినేత పర్యటనలో సైతం తమదైన శైలిలో ఎవరు పట్టుకు వారు ప్రయత్నించడం విడ్డూరంగా వుందని పార్టీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ వీళ్ళ వైఖరి మారదా అని ప్రశ్నిస్తున్నారు.

మానవహారం చేపడుతున్న సంస్థ సభ్యులు

'సీడ్' ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి-రావికమతం:ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినంను పురస్కరించుకొని మండల కేంద్రంలో సీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ, నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి కే.చిన్నారావు మాట్లాడుతూ, పోలీస్‌ల సమన్వయంతోఈ అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బాల బాలికలను అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మికులను పనుల్లో పెట్టడం చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి అక్రమ రవాణా జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రసాదు, కల్పన, ఎన్.పుష్ప, మంగ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం బుచ్చంపేట గ్రామంలోని కొత్తవీధిలో డ్రైనేజీ సమస్యతో గత కొన్ని సంవత్సరాలుగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని పరిసర ప్రాంతం ప్రజలు గ్రామంలో ఉన్న గ్రామ పెద్దలకు అనేకమార్లు సంప్రదించినా పరిష్కారం లభించ లేదు. దీంతో, బుచ్చెంపేట నవతరం గ్రూపు సభ్యులు చుట్టుపక్కల ఉన్న ప్రజల సహాయ సహకారాలతో పనులు ప్రారంభించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో లెక్కల రాజునాయుడు (పోలీస్), అనిమిరెడ్డి రామారావు (మెకానిక్), సబ్బవరపు సత్తిబాబు (మేస్త్రి), అనిమిరెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజ పనులు చేపడుతున్న సభ్యులు

ఆకులతో మత్స్యకారుల నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో డ్రగ్స్ కంపెనీ పైపులైనుకు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న మహాశాంతియుత ధర్నా ఆదివారం నాటికి 600 రోజులు పూర్తి చేసుకుంది. ఆందోళన శిబిరం వద్ద పైపులైన్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు ఆకులు కట్టుకుని అర్ధనగ్న వినూత్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ, హెటిరో డ్రగ్స్ కంపెనీ కొత్తగా వేస్తున్న రెండవ పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు ఆందోళన చేస్తున్నప్ప టికీ ,ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించక పోవడంతో మత్స్యకారులు జాతీయ హరిత ట్రిబ్యునల్ లో కేసు వేయడం జరిగిందన్నారు.కేసు విచారణలో ఉండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెటిరో డ్రగ్స్ కంపెనీతో కుమ్మక్కు అయ్యి చట్టాలను ధిక్కరించి, న్యాయ స్థానమును గౌరవించ కుండా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పైపు లైన్ వేయడానికి అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం.మహేష్‌బాబు, బి.అప్పలరాజు, సి.హెచ్ సోమేష్, కె.భూలోక, బి.నూకరాజు, పి.కాశీ, పి.రమణ, పి.కోటి, పి.కాశీ, ఎం.నానాజీ, డి.వీర్రాజు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

ఎఎల్ పురంలో కుక్కల బెడద

-గుంపులుగా సంచారం- భయాందోళనలో గ్రామస్తులు, వాహనదారులు

గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం గ్రామంలో కుక్కల బెడద రోజురోజుకు అధికం అవుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సింహాలను అరికట్టండి మహాప్రభో అని ఎన్ని సార్లు విన్నవించుకున్నా అధికారుల నుండి ఎటువంటి స్పందన లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరిపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని వాపోయారు. గత నెలలో రెండు రోజులు సమయంలో 38 మందిని గాయపరిచాయంటే ఈ ప్రాంతంలో కుక్కల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కనకదుర్గ గుడి, ఆర్టీసీ కాంప్లెక్స్, భారత పెట్రోల్ బంకు వద్ద కుక్కలు గుంపులు గుంపులుగా ఉండి వాహనాలపై ప్రయాణించే వారిని కూడా వదలకుండా దాడులు చేస్తున్నాయన్నారు. రాత్రి సమయంలో బైకులపై ప్రయాణించే వ్యక్తులను వెంట పడడంతో పడిపోయి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి.పంచాయతీ పాలకవర్గం దృష్టి సారించి గ్రామ సింహాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రాణాపాయ స్థితిలో యువకుడు

ప్రజాశక్తి-యస్.రాయవరం:తన కొడుకుకు వైద్య సహాయం అందించి ప్రాణభిక్ష పెట్టాలని తల్లిదండ్రులు వేడుకున్నారు వివరాలు. .మండలంలోని చినగుమ్ములూరు గ్రామానికి చెందిన తండ్రి కోసూరు శ్రీనువాసరావు అందించిన వివరాల ప్రకారం.. తనకు ఒక్కగానొక్క కుమారుడు పవన్ కుమార్ (14) ఉన్నాడన్నారు. పాఠశాలలో కరోనా వ్యాక్సిన్ వేసుకున్న మూడు రోజుల తరువాత కుమారుడికి జ్వరం వచ్చిందన్నారు. దగ్గర్లోని ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్ళగా తగ్గిందన్నారు. మళ్లీ రెండు రోజుల తరువాత ఒక్కసారిగా పరధ్యానంగా ఉండటంతో విశాఖ కేజిహెచ్‌కు తరలించామన్నారు. టెస్టులు అనంతరం మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడని, హైదరాబాద్ తీసుకెళ్ళి మెరుగైన వైద్యం అందించమని తెలిపారన్నారు. హైదరాబాద్ ఆసుపత్రిలో పరీక్షల అనంతరం ఇంటర్ఫెరాన్ ఆల్ఫా 2 బి అను ఇంజెక్షన్ రెండు డోసులు ఇచ్చారన్నారు. ఇంకో నాలుగు ఇంజెక్షన్లు చేస్తే తమ అబ్బాయి కోలుకుంటాడని డాక్టర్లు తెలిపారన్నారు. ఆ ఇంజెక్షన్లు బ్యాన్ చేశారని ఆసుపత్రి వర్గాలు తెలపడంతో పాటు డిశ్చార్జ్ చేశారన్నారు. ఆ ఇంజెక్షన్ ఎక్కడ లభ్యమౌతుందో తనకు సమాచారమందించాలని భోరున విలపిస్తూ వేడుకుంటున్నాడు. తన సెల్ నెంబరు 7095057052కు సమాచారమిస్తే ఎంత దూరమైన తాను వెళ్ళి తెచ్చి తన కొడుకును రక్షించుకుంటానన్నారు.

మెదడు వ్యాధితో బాధపడుతున్న యువకుడు

బురదగా తాగునీరు

- ఎమ్మెల్యేకు మహిళల మొర

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:18వ వార్డ్ బలిఘట్టంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ పర్యటించారు. వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కౌన్సిలర్ శెట్టి విజయ యాంబా, శెట్టి మోహన్‌లు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గత 20రోజులుగా తాగునీరు బురద గా వస్తోందని, కొందరు మహిళలు ఫిర్యాదు చేశారు. మంచినీటి కొళాయిలకు ట్యాప్‌లు వేయాలని కోరారు.ఎమ్మెల్యే గణేష్ అక్కడికక్కడే నమోదు చేసుకొని చర్యలకు ఆధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో నర్సీపట్నం మున్సిపల్ చైర్పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, 18వ వార్డు కౌన్సిలర్ శెట్టి విజయ యాంబ, సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ శెట్టిమోహన్, బలిఘట్టం దేవస్థానం చైర్మన్ శెట్టి చిన్న, గ్రామ వైఎస్సార్ నాయకుడు సుర్ల నాయుడు, టౌన్ వైఎస్ఆర్ అధ్యక్షుడు ఏక శివ, నాయకులు పెట్ల నాయుడు, ఎండి బాషా, యలమంచిలి నాని, గణమ్మ, చోటి, రోజా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుపుతున్న మహిళ

జగనన్న గృహాలు కట్టేదెన్నడు ?

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నాలుగేళ్ల కాలం గడుస్తున్నా నాతవరం మండలం గునుపూడి గ్రామంలో జగనన్న కాలనీలో ఒక్క ఇల్లు కూడా కట్టలేదని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర విమర్శించారు. ఆదివారం నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ ఆధ్వర్యంలో నాతవరం మండలం గునుపూడి గ్రామంలో జగనన్న కాలనీ లే అవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, లే అవుట్లలో స్థల సమస్యను పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారన్నారు. ప్రతీ గ్రామంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని కబుర్లు చెబుతున్నారని, క్షేత్ర స్థాయిలో ఎక్కడా జరగని పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, సీనియర్ నాయకులు పోలుపర్తి సూరిబాబు, యూత్ అధ్యక్షులు బైన మురళీ, బల్లా అశోక్, నమ్మి రమణరాజు, శెట్టి తనుజ్, వర్రి అప్పలనాయుడు, పైలపూడి అప్పలనాయుడు, దుర్గాసతీష్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యటిస్తున్న టిడిపి నాయకులు

ఇంటింటికీ టిడిపి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక మున్సిపాలిటీ ఒకటవ వార్డులో తెలుగుదేశం పార్టీ మున్సిపల్ నాయకులు లాలం మురళీ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటిం టికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ కరపత్రాలు పంపిణి చేశారు. అంతరం వారు మాట్లాడుతూ, టిడిపి హయాంలో పేద ప్రజలకు న్యాయం జరిగిందని, పెన్షన్లు, పక్కా గృహాలు, ఉచిత విద్యుత్, 2రూపాయలకు కిలో బియ్యం తదితర పథకాలను అందాయన్నారు. ప్రోత్సాహంతో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

దీక్ష చేపడుతున్న నాయకులు, గిరిజనులు

న్యాయం జరిగే వరకూ పోరాటం

ప్రజాశక్తి -కోటవురట్ల:అణుకు గిరిజన ప్రాంత ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు తెల్చి చెప్పారు. రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 24 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామానికి పాఠశాల, రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రాంత ప్రజలు, మహిళలు, డేవిడ్‌రాజు, సూరిబాబు, రమేష్, కేశవరావు, సోమేశు, శ్రీరాము, రాజబాబు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి-మాడుగుల:జాలం పల్లి పంచాయతీ రావి పాలెంలో ఆదివారం పలువురు జన సేన పార్టీలో చేరారు. ఆ పార్టీ నేత రాయపు రెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా చెప్పాడు మారయ్య పలు గ్రామ సమస్యలు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో హరేరామ వెంకటేష్ వర్మ, గుమ్మడి అప్పారావు, బొడి శ్రీ ఇవాస్, రామి శ్రీనివాస్, గట్టా రామారావు, కోన శ్రీను, గుమ్మాల నానాజీ, రామకృష్ణ, కాలింగి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అల్లదిగో...జగనన్న లే అవుట్

- సుదూరంగా ఉండటంతో ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాని లబ్ధిదారులు

ప్రజాశక్తి-కోటవురట్ల: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న లేఔట్ నేటికీ నీలిగుంట గ్రామంలో వృధాగానే దర్శనమిస్తుంది. ప్రభుత్వం కేటాయించినా ప్రజలు తిరస్కరిస్తున్నారు. జగనన్న కాలనీ లే అవుట్ ప్రారంభ దశలో ఏర్పాటు చేశారు. ఈ లే అవుట్‌లో నేటికీ ఒక్క ఇల్లు నిర్మాణం కూడా చేపట్టలేదు. ఇక్కడ లేఅవుట్ నిర్మాణం కోసం 31 మంది లబ్ధిదారులకు సరిపడా స్థలం కేటాయించడంతో పాటు బోరు బావి, విద్యుత్ సౌకర్యం, తాత్కాలిక రోడ్లు, తదితర సౌకర్యం కోసం లక్షల రూపాయలు ఖర్చు చేశారు. నేటికీ గ్రామంలో ఒక్క లబ్ధిదారులు కూడా ఇక్కడ ఇల్లు నిర్మించేందుకు వెనుకాడుతున్నారు. గ్రామానికి దూరంగా లేఅవుట్ కేటాయించడం కారణంగానే లబ్ధిదారులు ముందుకు రాలేదని గ్రామస్తులు వాపోతున్నారు. అయితే ఈ విషయంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టకపోతే కొత్తవారిని ఎంపిక చేసి పనులు ప్రారంభించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు తెలిపారు.

ఇదే జగనన్న లే అవుట్

ప్రయాణం.. ప్రమాదకరం

- కూలిన వంతెన రక్షణ గోడ

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలోని అల్లూరి సీతారామరాజు పార్కు సమీపంలో ఉన్న వంతెన వద్ద రక్షణ గోడ కూలి ప్రమాదకరంగా మారింది. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవు తున్నారు. ఇటీవల కొన్ని నెలల క్రితం రక్షణ గోడ కూలినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఈ మార్గం గుండా నిత్యం శరభన్నపాలెం, చింతపల్లి, పాడేరు తదితర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ సమయంలో జరగరానిది జరిగితే పరిస్థితి ఏంటని అంతా ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కూలిన రక్షణ గోడను నిర్మించాలని కోరుతున్నారు.

కూలిపోయిన రక్షణ గోడ

మణిపూర్‌లో హింసపై మానవహారం

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:మణిపూర్ ఘటనపై విధసం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆబీద్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద అర్ధ నగ్న ప్రదర్శన మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా విదసం జిల్లా నాయకులు ఎల్లాజీ మాట్లాడుతూ, మణిపూర్‌లో ఆర్తనాదాలు మోడీకి వినబడలేదన్నారు. రాష్ట్రపతి స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వై.పాపారావు, బొట్ట నాగరాజు, అప్పారావు అల్లంపల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

నినాదాలు చేపడుతున్న నాయకులు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

ప్రజాశక్తి-రావికమతం: ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపించాలని ప్రకృతి వ్యవసాయ మండల ఇంచార్జ్ ఎర్రం శెట్టి నిర్మల సూచించారు. మండల కేంద్రంలో పలు పాకల వద్ద ప్రకృతి వ్యవసాయ సాగుకు సంబంధించి మీనామృతం తయారు చేసే విధానాన్ని రైతులతో చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కుండలో నాలుగు కేజీలు చేపల వ్యర్థాలు, నాలుగు కేజీల బెల్లం, 1.1 పొరలుగా వేసుకొని 25 రోజులు లేదా 27 రోజులు ఉంచాలన్నారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం కలిపి, 27 రోజులుతర్వాత వడపోసి వాడుకోవాలన్నారు. ఆవు మాత్రం కలిపి పిచికారి చేసుకున్నట్లయితే ఆరు నెలలు నిల్వ ఉంటుందన్నారు.రెండు లీటర్లు మీనామృతం 200 లీ. నీళ్లు కలిపి పిచికారి చేసుకొని వాడుకోవాలన్నారు.

అవగాహన కల్పిస్తున్న నిర్మల